## వైభవోపేతంగా శైవక్షేత్రాలలో

# మహాశివరాత్రి వేడుకలు

**-ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి-మంత్రి అనగాని సత్యప్రసాద్**
**-అరవపల్లి,మోర్తోట పుణ్యక్షేత్రాలలో పోటెత్తిన భక్తులు**

రేపల్లె, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: మండలంలోని అరవపల్లిలో శ్రీ బాలకోటేశ్వర స్వామికి మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్స్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్,బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ భక్తి శ్రద్ధలతో పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ









సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ శివుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అన్నారు.ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.భక్తులకు ప్రసాదాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు,ఆలయ ధర్మకర్త కొమ్మూరి సత్యనారాయణ,అర్చకుడు రమేష్‌బాబు,సర్పంచ్ లోయ బాబు,ఆలయ కమిటీ సభ్యులు, కెడబ్ల్యూఎస్ ఛైర్మన్ పంతగాని మురళీధరరావు, జి.శ్రీనివాసరావు,తాతా ఏడుకొండలు,గుర్రం మురహరిరావు,జమీర్,రేపల్లె సి.ఐ మల్లికార్జునరావు,కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.శ్రీ బాలకోటేశ్వర స్వామిని మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణరావు కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు.కార్యక్రమంలో మోపిదేవి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.లింగోద్భవకాలంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, జగాజ్యోతి, మహానివేదన,జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**భారీగా భక్తులకు అన్నసంతర్పణ..**

రేపల్లె పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త,రాజకీయవేత్త మోపిదేవి శ్రీనివాసరావు,నాగేశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో అరవపల్లి శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం వద్ద వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మోపిదేవి శ్రీనివాసరావు,నాగేశ్వరమ్మ దంపతులు మాట్లాడుతూ భక్తులకు నిర్వహిస్తున్న అన్న సంతర్పణ కార్యక్రమం 28వ సంవత్సరంలోకి ప్రవేశించిందన్నారు.దైవదర్శనం కోసం వచ్చే భక్తులకు ఆహారాన్ని అందించడంలో సంతృప్తినిస్తున్నదని చెప్పారు.ఇప్పటి వరకు ఎటువంటి అవరోధాలు లేకుండా అన్నసంతర్పణ కార్యక్రమం కొనసాగిస్తున్నామంటే మహిమాన్వితమైన శ్రీ బాలకోటేశ్వరస్వామి అనుగ్రహం ఉన్నందునే సాధ్యపడుతున్నదని మోపిదేవి శ్రీనివాసరావు,నాగేశ్వరమ్మ దంపతులు వెల్లడించారు.తీరప్రాంతంలోని ప్రజల సంక్షేమానికి శ్రీ బాలకోటేశ్వరస్వామి అనుగ్రహం లభిస్తుందని తెలిపారు.

**ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో..**

మహాశివరాత్రి సందర్భంగా ఆరవపల్లి బాలకోటేశ్వర స్వామి తిరుణాలలో భక్తులకు పులిహోర,శనగలు,కేసర,స్వీట్,బూందీ,వాటర్ ప్యాకెట్స్,మజ్జిగ,పుచ్చకాయ ముక్కలను రేపల్లె శ్రీ వాసవి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షురాలు పి.గౌరీరామకుమారి,ఉషారాణి,సత్యవతి,విజయ,ఇందుమతి,మల్లేశ్వరి,సుందరి తదితరులు పాల్గొన్నారు.మహాశివరాత్రి సందర్భంగా వైసీపీ బిసి సెల్ కార్యదర్శి పీటా నాగమోహన్ కృష్ణ సహకారంతో పీటా పోతురాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

**మోర్తోట పుణ్య క్షేత్రంలో..**

రేపల్లె మండలంలోని మోర్తోట శ్రీ గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.స్వామివారికి పట్టు వస్త్రాలను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు,రేపల్లె నియోజవకర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ సమర్పించారు.అభిషేకాలు,జ్యోతి మహాదీపారాధన,శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.పూజా కార్యక్రమాలను వంశపారంపర్య ప్రధాన అర్చకుడు చావలి సురేష్ శర్మ,త్రయాహ్నిక యాజ్ఞీకులు ప్రభల శ్యామ్ కృష్ణశర్మ,చావలి వెంకట శివసాయిశర్మ,చావలి శివశర్మ,పన్నాల సాయిచైతన్య శర్మ,నందివెలుగు సుమంత్ శర్మ నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అన్నదాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక దర్మకర్త సిద్ధార్థబాబు, కెడబ్ల్యూడి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు,తాతా ఏడుకొండలు, కొలసాని రాము,కేసన రామకృష్ణ,దండుప్రోలు పిచ్చయ్య,కిట్టయ్య,దొక్కు శ్రీనివాసరావు,జమీర్ తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలులో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ కంచి కామాక్షి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారికి కుంకుమ సమర్పించి భక్తులకు ప్రసాదాలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ బి.విజయకుమార్,వాసవి క్లబ్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగభూషణం,వనిత జోన్ ఛైర్మన్ మాటూరుగృహలక్ష్మి,వెంకటేశ్వరరావు,జగదీష్,ఎస్.వద్మావతి,నాగరాజకుమారి,మాధురిదేవి తదితరులు పాల్గొన్నారు.



# లయకారుని లింగోద్భవం..

# భక్తజన సమ్మోహానం..!

**గుంటూరు ఫిబ్రవరి 15 ప్రభాత వార్త ప్రతినిధి :**

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి పరమశివుని దర్శనం కోసం క్యూ లైన్లలో వేచివున్నారు.శివయ్యకు అత్యంత ప్రీతిపాత్రమైన అభిషేకాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాలు, విభూతి, బిల్వపత్రాలతో పరమేశ్వరుడిని అర్చించారు. రాత్రంతా జరిగిన లింగోద్భవ కాల మహాభిషేకాలను చూసి భక్తులు తన్మయత్వంతో పరవశించారు .శివరాత్రి జాగరణను భక్తులు అత్యంత నిష్ఠతో పాటించారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయి.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

**కోటయ్యకు ప్రభుత్వం పట్టువస్త్రాలు**

పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో నిండిపోయింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పల్నాడు ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వీ ఆంజనేయులు, ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద్ బాబు, ఐ.జి సర్వ శ్రేష్ట త్రిపాఠి, కలెక్టర్ కృతిక శుక్లా, జాయింట్ కలెక్టర్ సంజన సింహ, ఎస్పీ బి. కృష్ణారావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి ప్రభుత్వం తరపున కోటయ్య స్వామికి పట్టు కోటయ్యకు ప్రభుత్వం పట్టువస్త్రాలు, గొల్లభామ అమ్మవారికి చీరా సారెను సమర్పించారు.

**పంచారామ క్షేత్రాలలో ప్రథమ క్షేత్రమైన అమరావతి**

బాల చాముండికా సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆదివారం తెల్లవారుజామున భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం 15 అడుగుల ఎత్తు ఉన్న భారీ స్ఫటిక లింగాకారుడైన అమరలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన అమరావతి శివనామస్మరణతో గాలి తరంగాలు కూడా పునీతమయ్యాయి. భక్తులంతా "ఓం నమః శివాయ" అనే పంచాక్షరీ మంత్రంతో అమరారామాన్ని కైలాసంగా మార్చేశారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా , పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, వివిధ కోర్టుల న్యాయమూర్తులు స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

**పెదకాకానిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దేవాలయం**

మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తజన సంద్రమైంది. శోభాయమానంగా ప్రభల ఉత్సవం జరిగింది. పండుగ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, అల్పాహారం, ప్రసాదం తదితర సౌకర్యాలు కల్పించారు.శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామిని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దంపతులు ,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడు దంపతులు, సినీ దర్శకుడు బోయపాటి శీను, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ లీలా కుమార్, ఛైర్మన్ పూర్ణచంద్రరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గుంటూరు జిల్లా వడ్లమూడి గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి (క్వారీ)** ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆలయ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. క్యూలైన్లు, మంచినీరు, పార్కింగ్ మరియు ప్రసాదాల పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుంటూరు జిల్లాలోనే అత్యంత విశేషంగా సాగే వడ్లమూడి క్వారీ తిరునాళ్ల, ఆధ్యాత్మిక కోలాహలంతో భక్తులకు కనువిందు చేసింది.















**లోక బాంధవుడు, లయకారుడైన ఆ పరమశివుని పర్వదినం మహాశివరాత్రి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యంత వైభవంగా జరిగింది. హర హర మహాదేవ.. శంభో శంకర.. అనే శివనామస్మరణతో పుణ్యక్షేత్రాలు మారుమోగాయి.పోటెత్తిన భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివపార్వతులకు పట్టు వస్త్రాలు స్వర్ణాభరణాలు, పరిమళపుష్పాలతో అలంకరించగా.. అర్చకుల వేదమంత్రాల మధ్య ఆదిదంపతులు శాస్త్రోక్తంగా ఒకటయ్యారు.ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించిన భక్తజనం పరవశించి పోయారు.పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, వివిధ వాహన సేవలు నిర్వహించారు.**








# భక్తిశ్రద్ధలతో బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ళ

**-శివ నామస్మరణతో మార్మోగిన క్వారీ**
**-భక్తులతో పోటెత్తిన క్వారీ తిరునాళ్ళ**
**-స్వామివారికి పొంగళ్ళను సమర్పించుకున్న మహిళా భక్తులు**
**-జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు**
**-పెద్ద ఎత్తున తరలి వచ్చిన విద్యుత్ భారీ ప్రభలు**
**-పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ దంపతులు.**

చేబ్రోలు(పొన్నూరు), ఫిబ్రవరి 15,ప్రభాతవార్త: ఓం నమ: శివాయ....ఓం నమ: శివాయ.....జై జై శివ.....శంకర శివ....జై కోటయ్య, జైజై కోటయ్య....కాపాడయ్యా కోటయ్య...అనే భక్తుల నినాదాలతో చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి గ్రామంలోని క్వారీ మార్మోగిపోయింది. క్వారీలో వేంచేసియున్న శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి తిరునాళ్ళ సందర్భంగా జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఒక నెల రోజుల ముందు నుంచే అధికారులు తిరునాళ్ళకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్ల గురించి సమీక్షలు నిర్వహించి వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఈ తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా స్వామివారికి వేకువ జాము నుంచే మహా రుద్రాభిషేకాలు, విశేషార్చనలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. క్వారీ భక్తులతో పోటెత్తింది. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారికి నైవేద్యాలను సమర్పించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. క్వారీ తిరునాళ్ళకు ఓ ప్రత్యేకత ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తిరునాళ్ళ సందర్భంగా చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలను దేవాలయం వద్దకు తరలించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభలపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయాన్ని,పరిసర ప్రాంతాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను వివిధ మార్గాల ద్వారా తరలించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, దేవాదాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులకు



సూచించారు. తిరునాళ్ళ సందర్భంగా జెయింట్ వీల్స్, మిఠాయి అంగళ్ళు, వివిధ రకాల బొమ్మల దుకాణాలు వెలిశాయి. చెరుకుగడల విక్రయాలు కూడా భారీగా జరిగాయి. తిరునాళ్ళ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తెనాలి డిఎస్పీ జనార్ధనరావు నేతృత్వంలో పొన్నూరు రూరల్ సిఐ కృష్ణయ్య పర్యవేక్షణలో ఎస్సైలు వీరనారాయణ, ఈశ్వరరావులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు అధికారులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అశితోష్ శ్రీవాస్తవ, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీకుమారి, తహశీల్దార్ కళ్యాం శ్రీనివాసశర్మ కంట్రోల్ రూమ్ వద్ద యాత్రీకులను, సిబ్బందిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేశారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి బి.నరసింహారావు, ఫెస్టివల్ ఆఫీసర్ ఆంజనేయులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.







# నేడు కార్పొరేషన్‌లో ఫిర్యాదుల స్వీకరణ

## కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 15 ( ప్రభాతవార్త) :** నగరంలో ప్రజలు ఎదుర్కొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల సేకరణ కార్యక్రమం సోమవారం కార్పొరేషన్ లో నిర్వహించడం జరుగుతుందని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ వెల్లడించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కారం నిమిత్తం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కార్పొరేషన్ లోని అన్ని విభాగాలు అధిపతులు ఈ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనాలని, ప్రాధాన్యతను బట్టి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.



## ఆకురాతి బ్రదర్స్ సేవలు ఆదర్శనీయం: మంత్రి అనగాని

**చెరుకుపల్లి ,ఫిబ్రవరి 15, (ప్రభాతవార్త):** దశాబ్దాల కాలంగా గుల్లపల్లి గ్రామస్తులు ఆగరాతి వెంకట సుబ్బారావు, సుబ్రహ్మణ్యం సోదరులు మహాశివరాత్రి పండుగ రోజు భక్తులకు అల్పాహారం, మజ్జిగ , మంచినీళ్లు ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం గుల్లపల్లి శివాలయం ముందు భక్తులకు ఏర్పాటుచేసిన అల్పాహారం శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు తోటి వారికి ఆదర్శనీయమని మంత్రి అనగాని ఆకురాతి సోదరులను అభినందించారు.



# బాపట్ల జిల్లా వార్త



## విద్యార్థులకు హిందీ పరీక్షలు

**భట్టి ప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :**మండల కేంద్రమైన భట్టి ప్రోలులోని సిద్ధార్థ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో ఆదివారం విద్యార్థులకు హిందీ పరీక్షలు నిర్వహించినట్లు కరస్పాండెంట్ వేల్పూరి నాగేశ్వరరావు తెలిపారు.ప్రాథమిక పరీక్షలో 54 మంది,మధ్యమిక పరీక్షలో 67 మంది,రాష్ట్ర భాషా పరీక్షలో 48 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన చెప్పారు.హిందీ పరీక్షలు సజావుగా జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.



## గోవాడ బాలకోటేశ్వరుడిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల,ఫిబ్రవరి 15, (ప్రభాతవార్త):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం అమృతలూరు మండలం గోవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలకోటేశ్వర స్వామి వారిని కలెక్టర్ దర్శించుకున్నారు.ముందుగా ఆలయానికి చేరుకున్న కలెక్టర్ కు ఆలయ ఈవో, చైర్మన్ ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు కలెక్టర్ కు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం చేశారు.ఏర్పాట్లపై కలెక్టర్ ఆరా:ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖ మరియు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను కలియతిరిగిన ఆయన.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలపై అధికారులకు, ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. బాలకోటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో



ఉండాలని, బాపట్ల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని స్వామివారిని ప్రార్థించానన్నారు.ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో ఎన్. రామలక్ష్మి, ఆలయ ఈవో శ్రీనివాస వర్మ, పాలక మండలి అధ్యక్షులు రమేష్, గ్రామ సర్పంచ్ రమేష్, చెరుకుపల్లి మరియు అమృతలూరు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

## శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

**నిజాంపట్నం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులు చేసిన నినాదాలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కోరిన కోర్కెలు తీర్చే భోళాశంకరుని ఆశీస్సుల కోసం భక్త జనం క్యూకట్టారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో వేంచేసియున్న శ్రీ గోకర్ణేశ్వరస్వామి, గోకర్ణమఠంలో వేంచేసియున్న శ్రీ గోకర్ణేశ్వరస్వామి, కొమరవోలులో వేంచేసియున్న శ్రీ కామేశ్వరీదేవి ఆలయంలో, కొత్తపాలెంలో వేంచేసియున్న శ్రీ రసేశ్వరస్వామి వార్ల తిరునాళ్ళ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ రకాలైన పండ్ల రసాలతో, పంచామృతాలతో, పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులు దేవాలయాలకు బయలుదేరి స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆయా దేవాలయాలలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు గంటకుపైగానే సమయం పట్టింది. భక్తులు క్యూలో నిల్చుని తమ ఇష్టదైవమైన శివుని స్తుతిస్తూ హరహరమహాదేవ శంభోశంకర అంటూ తమ భక్తికి చాటుకున్నారు. రైతులు తమ పశువులను, మోటారు వాహనాలను యజమానులు ఆలయాలచుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా దేవాలయాలను మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలతో, రంగురంగుల తోరణాలతో, రంగులతో అలంకరించారు. ఎటువంటి



అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిజాంపట్నంలో ఎస్ఐ కందుల తిరుపతిరావు, కొత్తపాలెంలో అడవులదీవి ఎస్ఐ బాబూరావు తన సిబ్బందితో గట్టిబందో బస్తును ఏర్పాటుచేశారు. భక్తులు నిర్మించిన ప్రభలు రాత్రి 11 గంటల వరకు దేవాలయం వద్దకు వస్తూనే ఉన్నాయి. గోకర్ణమఠం తదితర ప్రాంతాలలోని ప్రజలు ప్రభలను నిర్మించి రాత్రి సమయంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు మోళతాళాలతో డప్పువాయిద్యాలతో తోడ్కొనివచ్చారు. నిజాంపట్నం, కూచినపూడిలలోని ప్రభుత్వ వైద్యశాలల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. భక్తుల కోసం దాతలు ప్రసాద వితరణ నిర్వహించారు. జాగరణ చేసే భక్తుల కొరకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# పవిత్రతకు మారుపేరు రంజాన్

## జమీయత్ఉల్మ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా

**బాపట్ల. ఫిబ్రవరి 15. ప్రభాతవార్త:** పవిత్రతకు మారుపేరు రంజాన్ మాసం అని శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. స్థానిక జమేదార్ పేటలో జమయత్ ఉల్మ సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల లోని



మసీదుల పేష్మాములకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు భరతమాత ముద్దుబిడ్డలన్నారు. ప్రతి ఒక్కరు తమ మతాన్ని గౌరవించడంతోపాటు ఇతర మతాన్ని కూడా గౌరవిస్తూ ఉండాలన్నారు. జమీయత్ ఉల్మా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. వేగేశన ఫౌండేషన్ ఫిబ్రవరి నెల రంజాన్ మాసంలో స్థాపించడం జరిగిందన్నారు. ఆనాటి నుండి ప్రతీ సంవత్సరం బాపట్ల నియోజకవర్గంలోని అన్ని మసీదుల పేస్ మామ్ , మోజనులకు లకు రంజాన్ తోఫా తమ ఫౌండేషన్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రంజాన్ మాసం సందర్భంగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జమీయత్ ఉల్మా సంస్థ ఇదే స్ఫూర్తితో తమ సేవా కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం జమీయత ఉల్మా జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ అబ్దుల్లా బేగ్ మాట్లాడుతూ జమీయత్ ఉల్మ సంస్థ 1919లో స్థాపించబడిందన్నారు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థ తన సేవా కార్యక్రమాలనుచేపడుతుందన్నారు. జమ్మియత్ ఉల్మా సంస్థ కులమతాలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. దానిలో భాగంగా నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో ఈ సంస్థ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పేష్మాలకు రంజాన్ తోఫా ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా త్వరలో పేష్మాముల కోసం హెల్త్ కార్డులు కూడా ఇవ్వడానికి తమ సంస్థ పనిచేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది పేష్మాములకు రంజాన్ తోఫా ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముఫ్తీ నూరుద్దీన్,సెక్రటరీ ఆఫీస్ అనస్, ట్రెజరర్ షేక్ మీరా సాహెబ్ కమిటీ సభ్యులు టిడిపి మైనారిటీ నాయకులు ఫరీద్ మస్తాన్,మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం సమగ్ర కులగణన జరపాలి : కేసన శంకరరావు

**రేపల్లె,ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జనాభా గణాంకాల సేకరణ ఫార్మెట్‌లో ఒబిసి కాలం చేర్చి సమగ్ర కులగణన జరపాలని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్‌కు స్వయంగా వినతిపత్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జనాభా లెక్కల సేకరణ ఫార్మెట్‌లో పొందుపరచిన 33వ ప్రశా ్నవళిలోని 12వ ప్రశ్నను పరిశీలిస్తే కుటుంబ పెద్ద,ఎస్సీ,ఎస్టీ,ఇతర వర్గం అని



మాత్రమే పేర్కొన్నారని చెప్పారు.ఈ కాలమ్‌లో ఒబిసి కాలమ్ చేర్చి సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను కోరినట్లు శంకరరావు పేర్కొన్నారు.1931 సంవత్సరం వరకు బ్రిటీష్ ఇండియాలో మాత్రమే జనగణనతో పాటు కులగణన సమగ్రంగా జరిగిన విషయాన్ని కేంద్ర మంత్రికి గుర్తు చేసినట్లు చెప్పారు.అప్పటి నుంచి స్వతంత్ర భారతావనిలో ఇంతవరకు జరగలేదని శంకరరావు వివరించారు.భారతదేశ ప్రధాన మంత్రి నరేంద మోడీ నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి జనగణనతో పాటు సమగ్రంగా కులగణన ప్రారంభించడం అభినందనీయమని ఆయన అభిప్రాయపడ్డారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా

**రేపల్లె, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణ ముస్లిం యువత ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్నారు.తోటి వారిపై దయ చూపితే దేవుడు దయ చూపుతారనే దైవ ప్రవక్త మహమ్మద్ ప్రభోదాలను నిర్వాహకులు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జనాబ్ మీర్జా అన్వర్ బేగ్ సాహెబ్,సాధిక్ బేగ్,బాషా,షేక్ ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యాలు కలిగితే ఉపేక్షించేది లేదు

**చెరుకుపల్లి ,ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహాశివరాత్రి ఆలయాలను సందర్శించే భక్తులకు ఆయా దేవస్థానాలు పరిధిలో అవసరాలు ఏర్పడితే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్



అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టర్ గోవాడ బాల కోటేశ్వర స్వామి తిరుణాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిధిలో ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా క్యూ లైన్లు, ప్రసాదాల నాణ్యత ,భక్తులకు మంచినీరు ,వైద్య సౌకర్యాలను పరిశీలించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని వారికి ఎక్కడ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలు ద్వారా నిఘాను ఎప్పటికప్పుడు వీక్షించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి ,అసిస్టెంట్ కమిషనర్ వి అనుపమ, ఈవో వర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్, ఆలయ అర్చకులు, సిబ్బంది ,పలువురు అధికారులు పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మారుమ్రోగిన శైవ క్షేత్రాలు

**నగరం, ఫిబ్రవరి 15 ,ప్రభాతవార్త:** మహాశివరాత్రి హిందువుల ఆచరించే పండుగలలో ప్రాశస్తమైనది . ప్రతి ఏటా మాఘ బహుళ చతుర్దశిలో చంద్రుడు శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర యుతుడైనప్పుడు వస్తుంది ,శివుడు ఈరోజే లింగాకారంలో ఆవిర్భవించాడని శివపురాణంలో ఉంది. మాఘమాసం కృష్ణపక్ష చతుర్దశి సంవత్సరములో 12 శివరాత్రులలో మహాశివరాత్రి పవిత్రమైనదిగా భావిస్తారు. మహాశివరాత్రి రోజు భక్తులు బిల్వ పత్రాలతో శివుడు నీ ఆరాధిస్తారు. ఆ రోజంతా ఉపవాసం ఉండి రాత్రంతా జాగారం చేస్తారు. శివరాత్రి రోజు శివ భక్తులు తెల్లవారుజామున లేచి స్నానం చేసి, పూజ చేసి ,ఉపవాసం ఉండి ,రాత్రంతా జాగరణ చేసి, మరునాడు భోజనం చేస్తారు. శివరాత్రి రోజు రాత్రంతా శివ పూజలు ,అభిషేకం ,అర్చనలు, శివలీల కథా పారాయణం జరుపుతారు. శివ క్షేత్రాలలో ఈ ఉత్సవమును ఘనంగా నిర్వహిస్తారు. శివాలయంలో ఎనిమిది రూపాల్లో శివుడు ప్రకాశిస్తూ ఉంటాడు. మొదటిగా మనకు కనిపించే బయటి ప్రాకారం లేదా శివాలయం కూడా రెండవది రాజగోపురం అది దాటి లోపలికి ప్రవేస్తే ధ్వజస్తంభం, గర్భాలయం



పై ప్రకాశించే త్రిశూల కలశం శివస్వరూపమై గర్భాలయంలోని లింగ స్వరూపమే, భక్తులు శివరాత్రి రోజు శివునికి బిల్వపత్రాలతో అభిషేకం చేస్తే ఈ ఎంతో పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. నగరం మండలంలోని పూడివాడ గ్రామాలలో ఉన్న శివాలయాంలో భక్తులు వేలాదిగా పోటెత్తి దైవదర్శనం చేసుకున్నారు. విద్యుత్ కాంతులతో ప్రభలను ఊరేగించి శివాలయం వద్ద కు చేర్చారు.

# కన్నుల పండువగా శివరాత్రి ఉత్సవాలు

**తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 15(ప్రభాతవార్త):** పట్టణంలోని ఆర్యవైశ్య అపరకర్మశాలలో మహా శివరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.కమిటీ అధ్యక్షులు పొన్నూరు శ్యామలరావు ఆధ్వర్యంలో ఆదివారం శివుడికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు.ప్రత్యేకంగా 11 మంది దంపతులతో మహా రుద్రాభిషేకం నిర్వహించినట్లు అధ్యక్షులు శ్యామలరావు తెలిపారు.వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం మెంబరు మద్దాళి శేషాచలం ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గుని శివుడికి పాలాభిషేకం చేశారు.గత 10 ఏళ్లుగా ఆర్యవైశ్య అపరికర్మశాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రతియేటా 250 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం హర్షణీయమని శేషాచలం ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ తూనుగుంట్ల సుబ్బారావు, కోశాధికారి గుండా



రామకోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గ్రంధి చంద్రమోళీశ్వర రావు, మెంబర్లు అచ్యుత సాంబశివరావు, కొల్లా గురునాధ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులను కలిసిన అసోసియేషన్ నాయకులు


**గుంటూరు విద్య ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఔట్సోర్సింగ్ టీచర్స్ అసోసియేషన్ ఐదవ రాష్ట్ర కార్యవర్గ సమావేశము గుంటూరులోని కృష్ణా నగర్ లోటస్ హైస్కూల్ నందు నిర్వహించిన అనంతరం ఎన్ టి ఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గౌరవ ప్రభుత్వ చీఫ్ విప్ జి వి ఆంజనేయులు ని గుంటూరులోని వారి స్వగృహమునందు యూనియన్ సభ్యులతో కలపడం జరిగింది. ఈ సందర్భంగా వారి సమస్యలను ప్రతిదీ విని మీ సమస్య న్యాయబద్ధమైనదని తప్పనిసరిగా సంబంధిత మంత్రి దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని, ప్రభుత్వం ఎప్పుడూ ఉపాధ్యాయ పక్షపాతి అని వారికి చెప్పడం



జరిగింది .ఈ సందర్భంగా బెజవాడ వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ గౌరవ జీవి ఆంజనేయులు ఎప్పుడు ఉపాధ్యాయుల పట్ల ఏ సమస్య తీసుకువెళ్లిన సమస్యకు కృషి చేయడానికి ముందుంటారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అదే విధంగా యూనియన్ సభ్యులందరూ జీవి కి ధన్యవాదాలు తెలిపి మా సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగు న్యాయం చేయవలసిందిగా కోరి ధన్యవాదాలు తెలిపారు ఎన్ టి ఏ అసోసియేటెడ్ అధ్యక్షులు చిగురుపాటి పినాక పాణి ప్రభుత్వం ఉపాధ్యాయుల పక్షపాతి అని మీకు తగిన న్యాయం కచ్చితంగా జరిగి తీరుతుందని నొక్కి వక్కాణించారు

## నృత్యకళా భారతి 27వ వార్షికోత్సవ సంబరాలు

**గుంటూరు ,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ నృత్యకళా భారతి ఆధ్వర్యంలో 27వ వార్షికోత్సవ సంబరాలు ఈ నెల 15022026 (ఆదివారం) సాయంత్రం 6:30 గంటలకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా నిర్వహించ



నున్నట్లు నిర్వాహకులు నాట్య విజ్ఞాన్ శ్రీ వి బాలు మరియు నాట్యాచారిని శ్రీమతి వి నవ్యశ్రీ గార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 76 మంది నర్తకీమణులచే కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని వైవిఎస్ ప్రభాకర్, డాక్టర్ పద్మావతి దేవి చాగంటి జ్యోతిప్రజ్వలన చేయగా ముఖ్య అతిథులుగా శ్రీమతి రాయపాటి శైలజగారు, తూర్పు ఎమ్మెల్యే శ్రీ మహమ్మద్ నజీర్ అహ్మద్ గారు, విశిష్ట అతిథులుగా ..శ్రీ చుక్కపల్లి రమేష్ , డాక్టర్ రాయపాటి మమత ఈ కార్యక్రమంలో పాల్గొని అందరిని అభినందించారు. సన్మాన గ్రహీత నాట్య శిఖామణి శ్రీ మట్టుపల్లి కాశియ్య గారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కళాభిమానులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## వాలీబాల్ లీగ్ పోటీలలో కృష్ణా జిల్లా జట్టుకు ప్రధమ స్థానం

### -రూ.25 వేలు నగదు బహుమతి

**భట్టి ప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు తమ్మన మల్లికార్జున రావు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ లీగ్ పోటీలు పులికొండ రాధాకృష్ణ గుప్తా,కొసన సుబ్బారావు(ఎన్‌డిఎస్) మెమోరియల్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమై ఆదివారం ముగిశాయి.ఈ పోటీలలో 8 టీమ్‌లు పాల్గొన్నాయి.కృష్ణా జిల్లా జట్టు ప్రధమ స్థానంలో నిలిచిందని ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్,కార్యదర్శి కె.సుబ్బారావు,వి.శేషగిరిరావులు తెలిపారు. ప్రధమ బహుమతి సాధించిన కృష్ణా జిల్లా జట్టుకు రూ.25 వేలు అందజేశారు.ద్వితీయ స్థానం సాధించిన బాపట్ల జిల్లా జట్టుకు రూ.20 వేలు అందజేశారు.తృతీయ స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా జట్టుకు రూ.15 వేలు,4వ స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ జిల్లా జట్టుకు రూ.10 వేలు,5వ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా జట్టుకు రూ.5 వేలు నగదును అందజేశారు.స్వర్గీయ కొసన సుబ్బారావు కుమారులు,కరీంశెట్టి వెంకటేశ్వరరావు, వెంకాయమ్మ కుమారులు, విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపి.వెంకట్రావు, ఐలవరం జిల్లా పరిషత్





ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పడమట బాబు,విశ్రాంత ఉపాధ్యాయుడు దాది సుబ్బారావులు విజేతల జట్ల కోసం నగదు సమకూర్చారు.అలాగే పులికొండ మల్లికార్జునరావు ,బట్టు నాంచారయ్య, అల్లాబక్షు,కొసన రఘు,ఎంపి వెంకట్రావు తదితరులు పూర్తి సహకారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో కె.రెడ్డయ్య, షేక్ కరీముల్లా,జి.వెంకటేశ్వరరావు ,జి.వెంకట శివనాగేశ్వరరావు ,సిహెచ్ .శ్రీనివాసరావు,అనూల్ హక్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్వారీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో ఆకట్టుకున్న బాలప్రభ

**తెనాలి టౌన్ ఫిబ్రవరి15(ప్రభాతవార్త):** తెనాలి మండలపరిధిలోని సంఘం జాగర్లమూడి రామాలయం వీధి వద్ద మహా శివరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.పసుపులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించిన బాల ప్రభ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. శివుడికి మొక్కులు తీర్చుకోవడం కోసం తమ బంధువులతో కలసి సంఘంజాగర్లమూడి రామాలయం నుంచి క్వారీ బాలకోటేశ్వరస్వామి శివాలయం వరకు గ్రామస్తులతో కలసి ఊరేగింపు నిర్వహించారు.అనంతరం ఆలయం చుట్టూ ప్రదీక్షణలు చేసి



స్వామికి పొంగళ్లు పొంగించారు.శివుడికి మొక్కులు తీర్చుకోవడం కోసం తమ బంధువులతో కలసి మూడవ ఏడాది క్వారీ బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.తమ ప్రాంతంలో పంటలు బాగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోడె గోపి,పి. స్వాతి,ఎం.అంజలి,మారిశెట్టి భాస్కర్,కె.పద్మ,పి.అంజమ్మ, పి.నాగలక్ష్మి,చిన్నారులు పాల్గున్నారు.



## మహాశివరాత్రి సందర్భంగా పాతశివాలయంలో అన్నప్రసాద వితరణ

తెనాలి టౌన్ ఫిబ్రవరి15 (ప్రభాతవార్త): పట్టణంలోని గంగానమ్మపేట లోగల పరశురామ ప్రతిష్ట శ్రీ రామేశ్వర స్వామి దేవస్థానం (పాతశివాలయం)లో సోమవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాపారవేత్త ఆర్యవైశ్య ప్రముఖులు భాస్కరుని శ్రీనివాసరావు అన్నప్రసాద వితరణ చేయడం గత కొన్నేళ్లుగా జరుగుతుంది. ఆదివారం పాత శివాలయం ప్రాంగణంలోని మండపంవద్ద తొమ్మిదివేలమందికి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భాస్కరుని శ్రీనివాసరావు మాట్లాడుతూ,ఈ సంవత్సరం నిర్వహించిన అన్నప్రసాద వితరణకు ఆర్యవైశ్యుల సహకారం ఉందన్నారు.ఈ అన్నప్రసాద కార్యక్రమానికి కొల్ల గురునాథ గుప్తా, నంబూరు నరేంద్ర,చెక్క చంద్రమోహన్,నూకల ఆదిత్య,మద్దాలి శేషాచలం, తొమ్మండ్రు మణిదీప్, ఆతుకూరి పూర్ణచంద్రరావు, వంకదారుశివ సుధాకర్ లు సహకరించినట్లు భాస్కరుని శ్రీనివాసరావు చెప్పారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పరిశీలించారు.అనంతరం శివకుమార్ మాట్లాడుతూ, మహాశివరాత్రి రోజున భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో పుణ్యకార్యం అన్నారు.వేల మందికి అన్నప్రసాద వితరణ చేసిన నిర్వాహకులను అభినందిస్తున్నట్లు,ఆ పరమశివుని ఆశీస్సులు అందరికీ ఉండాలని అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేసు శ్రీనివాసరావు,కటారి హరీష్, న్యాయవాది గుంటూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

